

గోరుకల్లుకు రూ.25 లక్షలు

పాణ్యం: గోరుకల్లు నిర్వహణకు ప్రభుత్వం రూ.25 లక్షలు కేటాయించిందని ఈఈ సుభకుమార్ తెలిపారు. గురువారం గోరుకల్లు జలాశయంలో ఉన్న నీటి సామర్థ్యాన్ని పరిశీలించారు.



ఇరుముడులు ప్రారంభం

శ్రీశైలం టెంపుల్: క్షేత్రంలో మహాశివరాత్రి శివ దీక్షా జ్యోతిర్ముడి సమర్పణ ప్రారంభమైంది. గురువారం నుంచి ఫిబ్రవరి 23వరకు 15 రోజుల పాటు దీక్షా విరమణ కార్యక్రమం నిర్వహిస్తారు.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,613.34
టీఎంసీల సామర్థ్యం	:105,788
ప్రస్తుతం	:44,595
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:000
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	:9,293

న్యూస్‌రీల్

శైవక్షేత్రాలకు 258 బస్సులు

కర్నూలు(రాజ్‌విహార్): మహాశివరాత్రి పండుగ సందర్భంగా శైవక్షేత్రాలకు 258 ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు జిల్లా ప్రజా రవాణా శాఖాధికారి టి. వెంకటరామం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఈనెల 17 నుంచి 19వరకు వీటిని తిప్పనున్నట్లు పేర్కొన్నారు. కాలినడకన శ్రీశైలం వెళ్లే భక్తుల సౌకర్యార్థం ఈనెల 13 నుంచి కర్నూలు- వెంకటాపురం మధ్య రద్దీ మేరకు బస్సులు నడుపుతామని తెలిపారు. డీజిల్ ధరలు పెరిగినా గత ఏడాది చార్జీలే వసూలు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

చార్జీల వివరాలు..

కర్నూలు- శ్రీశైలం రూ.350, ఆదోని-శ్రీశైలం రూ.500, ఎమ్మిగనూరు-శ్రీశైలం రూ.450, కోడుమూరు - శ్రీశైలం రూ.400, నందికొట్కూరు- శ్రీశైలం రూ.300, ఆత్మకూరు-శ్రీశైలం రూ.250, మహానంది-శ్రీశైలం రూ.350, కర్నూలు- వెంకటాపురం రూ.150 చొప్పున చార్జీ వసూలు చేయనున్నారు.

ఉగాది పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు(అగ్రికల్చర్): వ్యవసాయ అనుబంధ రంగాల్లో విశేషంగా రాణిస్తున్న రైతులకు ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉగాది పురస్కారాలు అందజేస్తోందని కర్నూలు ఏరువాక కేంద్రం కో-ఆర్డినేటర్ ప్రసాద్‌బాబు తెలిపారు. తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించడం, కెమికల్స్ లేకుండా సేంద్రియ వ్యవసాయ పద్ధతులు, పాడి పరిశ్రమలో విశేషంగా రాణిస్తున్న రైతులు ఈ పురస్కారాలకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తుదారులకు వ్యవసాయంలో కనీసం ఐదేళ్ల అనుభవం ఉండాలన్నారు. కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులోని ఏరువాక కేంద్రంలో దరఖాస్తులు లభిస్తాయని, ఈ నెల 17వ తేదీలోపు పూర్తిచేసిన దరఖాస్తులను ఇక్కడే అందజేయాలన్నారు. వినూత్న ఆవిష్కరణలు, ఆలోచనలకు తగిన రుజువులు ఉండాలని తెలిపారు. ఉత్తమ రైతులకు ఉగాది రోజున ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేతుల మీదుగా పురస్కారాలు అందజేస్తారని పేర్కొన్నారు.

నేడు రామ్‌చరణ్ సినిమా షూటింగ్


కర్నూలు: కొండారెడ్డిబురుజు దగ్గర శుక్రవారం ప్రముఖ హీరో రామ్‌చరణ్ సినిమా షూటింగ్ ఉన్నందున ట్రాఫిక్‌పై ఆ ప్రాంతంలో ఆంక్షలు విధించినట్లు కర్నూలు డీఎస్పీ కేవీ మహేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఆంక్షలు కొనసాగుతాయని పేర్కొన్నారు. రాజ్‌విహార్ వైపు నుంచి కాంగ్రెస్ కార్యాలయం మీదుగా పాతబస్తీ వైపు వెళ్లాల్సి ఉంటుందన్నారు. ఐదు రోడ్ల కూడలి నుంచి గోషా ఆసుపత్రి, కొత్తపేట రైతుబజార్, జిల్లా కోర్టు మీదుగా పాతబస్టాండ్‌కు చేరుకోవచ్చని పేర్కొన్నారు. జనసాంద్రత ఎక్కువ ఉంటున్నందున కోట్ల సర్కిల్ నుంచి కొండారెడ్డి బురుజు వరకు ఉన్న దుకాణదారులు ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు కూడా పోలీసు విజ్ఞప్తికి సహకరించాల్సిందిగా డీఎస్పీ కోరారు.



గుండె శస్త్ర చికిత్సల్లో తిరుగులేని విజయాలు

- ఒకే రోజు మూడు ఆపరేషన్లతో రికార్డు
- ఖర్చుకు వెనుకాడకుండా చిన్నకోత ఆపరేషన్లు
- ప్రభుత్వాసుపత్రికే పరిమితమైన డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి నిరంతర పర్యవేక్షణ
- విజయం కాదు సంతృప్తి ముఖ్యంగా వైద్య బృందం
- అత్యాధునిక సౌకర్యాలతో కూడిన విభాగం

దేవుడి గురించి రాయమంటే ఏమని రాస్తాం.. చేతులెత్తి మొక్కడం తప్ప. కనిపించని దేవుళ్లను నమ్మి రోజూ పూజలు, ప్రదక్షిణలు చేస్తుంటాం. మరి చావు ముఖంలో నుంచి కాపాడే కనిపించే దేవుళ్లను ఎంత పొగిడినా తక్కువే. ఒక్క గుండె సజావుగా ఉంటేనే విర్రవీగుతాం.. అలాంటిది ఆ గుండెకు ప్రాణం పోసే ఆ కత్తికి ఎన్ని గుండెలు ఉండాలి. గుండె శబ్దం వినాలంటేనే ఏదో తెలియని భయం ఆవహిస్తుంది.. కానీ కర్నూలు ప్రభుత్వాసుపత్రి వైద్యులు వేల గుండెలను లయబద్ధం చేస్తూ బ్రహ్మ రాతకు సవాల్ విసురుతున్నారు. – సాక్షి, కర్నూలు డెస్క్



రోగి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని ధైర్యం చెబుతున్న డాక్టర్ ప్రభాకర్ రెడ్డి

పెద్దాసుపత్రి.. పేదల గుండెచప్పుడు!

ప్రభుత్వ ఆసుపత్రి అంటేనే ప్రజల్లో ఒక చులకన భావన ఉంది. అక్కడికి వెళితే సరైన వైద్యం లభించదనే ఆలోచన. అందువల్లే మొదటగా ప్రయివేట్ ఆసుపత్రులకు వెళ్లడం అలవాటుగా మారింది. అక్కడ డబ్బు ఎక్కువ అనిపించడం, కేసు తీవ్రత కారణంగా వాళ్లు చేతులెత్తేసిన సమయాల్లో తిరిగి ప్రభుత్వాసుపత్రి మెట్లు తొక్కుతున్నారు. ఇలాంటి కేసులను ప్రభుత్వాసుపత్రి వైద్య బృందం సవాల్‌గా తీసుకొని చికిత్స చేస్తుండటం విశేషం.

రక్తం ఇస్తే చాలు..

ప్రభుత్వాసుపత్రిలోనూ ప్రయివేట్‌కు దీటుగా సౌకర్యాలు ఉన్నాయి. అవసరమైన రక్తం ఏర్పాటు చేస్తే చాలు ఎంత ఖర్చు అయినా వెనుకాడకుండా ఆపరేషన్ చేస్తున్నారు. ఒక రోగి విషయంలో మూడు యూనిట్ల రక్తం కుటుంబ సభ్యులు ఇవ్వగా, ఆపరేషన్ సమయంలో మరో మూడు యూనిట్లను ఆసుపత్రి సమకూర్చింది. అప్పటికీ ఫలితం లేకపోవడంతో ఆటో ట్రాన్స్‌మిషన్ ద్వారా రోగి రక్తాన్నే ఫిల్టర్ చేస్తూ ఆపరేషన్ నిర్వహించడం విశేషం. ఈ పురాతన ప్రక్రియ ప్రమాదకరమని తెలిసినా, అప్పుడున్న పరిస్థితుల్లో రోగిని కాపాడటం తప్ప మరో దారి కనిపించక వైద్యులు సాహసం చేసి ఫలితం రాబట్టారు.



కార్డియోథొరాసిక్ విభాగంలో రోగుల కోసం ఏర్పాటు చేసిన అధునాతన పడకలు

వయస్సు అయిపోయింది అనుకోకూడదు..

ప్రతి మనిషి తన జీవితాన్ని పూర్తిగా ఆస్వాదించాలి. వయస్సు మీద పడటం, వ్యాధులు అనేవి సర్వసాధారణం. వయస్సు పెరిగినంత మాత్రాన చావుకు దగ్గర అవుతున్నట్లు భావించడం తప్పు. వ్యాధులు ఏ వయస్సులో వచ్చినా ధైర్యంగా ఎదుర్కోవాలి. 70 ఏళ్లు పైబడిన వాళ్లకు గుండె జబ్బు వస్తే ఇక బతకం కష్టమనే అపోహ సరికాదు. నర్సిరెడ్డి అనే వ్యక్తికి 70 ఏళ్ల వయస్సులో ఇక్కడి ప్రభుత్వాసుపత్రిలో ఆపరేషన్ నిర్వహించారు. ఇప్పటికి ఆరేళ్లు కాగా.. ఆయన పూర్తి ఆరోగ్యంగా తన పనులు తాను చేసుకోగలుగుతున్నాడు.

చిన్న కోత ఆపరేషన్లు..



గుండె, ఊపిరితిత్తుల ఆపరేషన్లు అంటే ఎద మీద పెద్ద కోత పెట్టడమే మనకు తెలుసు. ఈ జబ్బులు ఇప్పుడు చిన్న పిల్లలకు, యువతకు కూడా వస్తున్నాయి. అయితే బాగా డబ్బున్న వాళ్లు చిన్న కోత ఆపరేషన్లు చేయించుకోవడం ద్వారా ఆపరేషన్ జరిగిందా, లేదా అన్నట్లుగా ఉంటున్నారు. ఇలాంటి ఆపరేషన్లను ప్రభుత్వాసుపత్రిలోనూ నిర్వహిస్తున్నారు. అయితే రోగుల వయస్సు, ఇతరత్రా అంశాల మీద ఆధారపడి ఈ ఆపరేషన్ చేస్తున్నారు. సుమారు రూ.5-6లక్షల వరకు ఖర్చు చొప్పున 60 మందికి ఇలాంటి ఆపరేషన్లు చేపట్టారు. పెద్దాపరేషన్ అయితే సుమారు రెండేళ్ల వరకు బరువులు ఎత్తకూడదు. అదే చిన్న కోత ఆపరేషన్ అయితే ఐదు రోజుల్లో డిశ్చార్జి, నెల రోజుల తర్వాత యథావిధిగా దైనందిన కార్యక్రమాలు చేసుకునే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు.

వైద్యుల సలహా..



- ఎలాంటి పరిస్థితుల్లోనైనా ఒత్తిడికి లోను కాకూడదు.
- సమస్యలు వచ్చినా తప్పక పరిష్కారం ఉంటుంది.
- చేయాల్సిందల్లా ఆలోచన మాత్రమే.
- క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తూ ఆహార నియమాలు పాటిస్తే గుండె జబ్బుల నుంచి మనల్ని మనం కాపాడుకోవచ్చు.
- తరచూ కొత్త ప్రాంతాలను చూడటం ద్వారా మనసుకు ప్రశాంతత లభిస్తుంది.

ఏది తిన్నా మితంగానే..



ఆధునిక ప్రపంచంలో ఏది తినాలన్నా భయమే, బయట తిరగాలన్నీ భయమే, ఏం చేయాలన్నా భయమే. ఇలా భయపడుతుంటే మన ఆయుష్షు కూడా తగ్గుతుంది. అందువల్ల మనల్ని మనం నియంత్రించుకుంటూ ఏదైనా మితంగా తీసుకుంటే అదే అమృతం. అధికంగా తీసుకుంటే విషయం. అది, ఇది అని నోరు కట్టుకోకుండా అన్నీ తినేయాలి. అయితే మితంగా.

ఒకే రోజు మూడు ఆపరేషన్లు

సాధారణంగా రోజుకు ఒక ఆపరేషన్, లేదంటే వారానికి ఒకటో రెండో ఆపరేషన్లు నిర్వహిస్తుంటారు. అలాంటిది ఒకే రోజు మూడు ఆపరేషన్లు నిర్వహించడం ఆసుపత్రి చరిత్రలో మర్చిపోలేని రోజు. వీటిలో ఒకటి సాధారణమైనదే అయినా రెండు అతిక్లిష్టమైనవి. ఉదయం 9 గంటలకు మొదలుపెడితే రాత్రి 12 గంటల వరకు వైద్య బృందం ఆపరేషన్ థియేటర్‌లోనే ఉండిపోవాల్సి వచ్చింది.

2016-2023 మధ్య నిర్వహించిన ఆపరేషన్లు : 588

కార్డియోథొరాసిక్ విభాగం

- మాడ్యులర్ థియేటర్లు – 2
- ఐసీయూ బెడ్స్ – 6
- ఐసోలేషన్ వార్డు – 1
- కామన్ బెడ్స్ – 20
- హార్ట్ లంగ్ మిషన్ – 1
- ఏబీజీ అనలైజర్ – 1
- బెడ్‌సైడ్ ఈసీజీ – 1
- బెడ్‌సైడ్ ఎక్స్‌రే – 1

వైద్యం బృందం

- డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి – హెచ్‌ఓడీ
- డాక్టర్ పి.హరికృష్ణ – అసోసియేట్ ప్రొఫెసర్
- డాక్టర్ రవీంద్ర – అసిస్టెంట్ ప్రొఫెసర్
- డాక్టర్ బెనెడిక్ట్ – అసిస్టెంట్ ప్రొఫెసర్
- నర్సులు – 9 మంది
- పర్ఫ్యూజనిస్టు – 1

6వేలకు పైగా ఆపరేషన్ల వైద్యుని పర్యవేక్షణ

ప్రభుత్వాసుపత్రిలోని కార్డియోథొరాసిక్ విభాగాన్ని డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి పర్యవేక్షిస్తున్నారు. ఈయన తన సర్వీసులో ఇప్పటి వరకు 6వేలకు పైగా ఆపరేషన్లు నిర్వహించారు. ఇంతటి సీనియర్ వైద్యుడు కావడంతో ఆసుపత్రికి వచ్చే ఎలాంటి క్లిష్టమైన కేసుకైనా చికిత్స అందుతోంది. కేవలం ప్రభుత్వాసుపత్రికే పరిమితమైన ఈయన గురించి కొన్ని విషయాలు సొంత మాటల్లో...

పదో తరగతిలోనే నిర్ణయించుకున్నా..

చిన్నప్పుడు వైద్యులకు ఇచ్చే గౌరవం చూసి ఎప్పటికైనా డాక్టర్ అవ్వాలనుకునేవాడిని. ఇక మన ప్రాంతంలో గుండె జబ్బులకు ఆపరేషన్లు నిర్వహిస్తున్న ఘనత మొదట అనంతపురం జిల్లా పుట్టపర్తిలోని సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికే దక్కింది. అలా నేను కూడా డాక్టర్‌గా ప్రభుత్వాసుపత్రిలోనే ఇలాంటి ఆపరేషన్లు నిర్వహించాలని గట్టిగా నిర్ణయించుకున్నా. ఇంటర్మీడియట్ తర్వాత మొదటి ప్రయత్నంలోనే విఫలమైనా ఆ తర్వాత కర్నూలు మెడికల్ కళాశాలలో సీటు దక్కించుకొని నా కల నెరవేర్చుకున్నా.

జేబును చూసి వైద్యం చేయరాదు

జీవితంలో డబ్బు సంపాదనే ఒక్కటే లక్ష్యం కాదు. ఈ విషయంలో న్యూరో సర్జన్ డబ్ల్యూ. సీతారాం గారు నాకు ఆదర్శం. ఆయన ముక్కుసూటి మనిషే కానీ, ఎంతో మానవత్వం కనిపిస్తుంది. తన వద్దకు వచ్చే రోగి జేబు చూసి కాకుండా జబ్బును చూసి వైద్యం చేయడం ఆయనను చూసి నేర్చుకున్నా. ప్రభుత్వాసుపత్రిలో ఇలాంటి సంతోషం దక్కుతుంది. ఇక్కడ పనిచేయడం గర్వంగా భావిస్తున్నా.

విజయం వేరు.. సంతృప్తి వేరు

విజయం అనేది ఒకరు చెబితే తెలుస్తుంది. అదే సంతృప్తి మనకు మనమే పొందుతాం. నా జీవితంలో ఈ రెండూ ఉన్నాయి. ఎంచుకున్న వృత్తిలో విజయం సాధిస్తూ, అందులోనే సంతృప్తి వెతుక్కుంటున్నా. ఎంత సంపాదించామనేది పక్కనపెడితే, మనం చేయాలనుకున్నది చేస్తూ పోవడమే అసలైన జీవితం.

కరోనా మార్చిన 'రాత'

రెండేళ్ల క్రితం వరకు వృత్తి తప్ప మరో వ్యాపకం లేదు. అయితే కరోనా నా 'రాత' మార్చింది. స్టేట్ నోడల్ అధికారిగా కరోనా సందేహాలను నివృత్తి చేయడం, అవసరమైన చికిత్సలను వీలైనంత మంది ఎక్కువ ప్రజలకు చేరవేయడానికి సోషల్ మీడియాను ఎంచుకున్నా. ఇందుకోసం నేను చెప్పదలుచుకున్న విషయాన్ని స్వయంగా రాయడం అలవాటు చేసుకున్నా. నా పోస్టును దేశ, విదేశాల్లో సుమారు 4లక్షల మంది చదువుతున్నారు. అందుకే అంటారు కత్తి కన్నా కలం గొప్పదని.



"నిద్రలేని రాత్రులు ఎన్నో..

ఒకప్పుడు గుండె, ఊపిరితిత్తుల జబ్బులకు హైదరాబాద్, బెంగళూరు వంటి నగరాలకు వెళ్లి లక్షలాది రూపాయలు ఖర్చు చేయాల్సి వచ్చేది. ఇప్పుడు ప్రభుత్వాసుపత్రిలోనే ఆపరేషన్లు నిర్వహిస్తుండటం శుభ పరిణామం. 2016లో కార్డియోథొరాసిక్ విభాగం ఏర్పాటైంది. సొంత ఇంటిని ఎలా నిర్మించుకుంటామో అప్పట్లో నేనూ ఈ విభాగ నిర్మాణంలో అలాంటి చొరవ తీసుకున్నా. ఎన్నో నిద్రలేని రాత్రులు చూశాం. ఇప్పుడు రోగులు సంతోషంగా ఇళ్లకు వెళ్తుంటే ఆ శ్రమకు తగిన ఫలితం లభించినట్లుగా భావిస్తుంటా. – సి.ప్రభాకర్‌రెడ్డి, కార్డియోథొరాసిక్ విభాగాధిపతి

మోగిన ఎమ్మెల్సీ ఎన్నికల భేరి



- మార్చి 13న పశ్చిమ రాయలసీమ పట్టభద్ర, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు
- నోటిఫికేషన్ విడుదల చేసిన కేంద్ర ఎన్నికల సంఘం
- ఈ నెల 16 నుంచి నామినేషన్ల దాఖలు
- మార్చి 16 న ఎన్నికల ఫలితాలు
- అమల్లోకి వచ్చిన ఎన్నికల కోడ్

కర్నూలు(సెంట్రల్): పశ్చిమ రాయలసీమ పట్టభద్ర, ఉపాధ్యాయ స్థానాలకు ఎన్నికల భేరి మోగింది. మార్చి 13వ తేదీన ఎన్నికలు నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేసింది. మార్చి 16వ తేదీన ఫలితాలను ప్రకటించనున్నారు. దీంతో పశ్చిమ రాయలసీమ పరిధిలోని ఉమ్మడి కర్నూలు, వైఎస్సార్, అనంతపురం జిల్లాల్లో కోలాహలం మొదలైంది. ఇప్పటికే ఆశావహులు ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి ప్రచార పర్వాన్ని కొనసాగిస్తున్నారు.

జిల్లా వారీగా ఓటర్ల వివరాలు (పట్టభద్రులు)

జిల్లాపేరు	పురుషులు	స్త్రీలు	ఇతరులు	మొత్తం
కర్నూలు	42,097	19,586	1	61,684
నంద్యాల	38,607	16,192	4	54,803

జిల్లా వారీగా ఓటర్ల వివరాలు (ఉపాధ్యాయులు)

జిల్లాపేరు	పురుషులు	స్త్రీలు	ఇతరులు	మొత్తం
కర్నూలు	2,983	2,381	0	5,364
నంద్యాల	2,785	1,616	1	4,402

16న నోటిఫికేషన్

పశ్చిమ రాయలసీమ పట్టభద్ర, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికల కోసం కేంద్ర ఎన్నికల సంఘం ఫిబ్రవరి 16వ తేదీన నోటిఫికేషన్‌ను విడుదల చేయనున్నది. అదేరోజు నుంచి అభ్యర్థులు నామినేషన్లను దాఖలు చేయవచ్చు. ఫిబ్రవరి 23వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. ఫిబ్రవరి 24వ తేదీన నామినేషన్ల పరిశీలన ఉంటుంది. ఫిబ్రవరి 27వ తేదీ వరకు విత్‌డ్రా చేసుకునేందుకు అవకాశం ఉంటుంది. మార్చి 13వ తేదీ ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఓటింగ్ ప్రక్రియను నిర్వహిస్తారు. ఓటింగ్‌లో నచ్చిన అభ్యర్థికి ప్రాధాన్యత ఓటును వేసుకోవడానికి అవకాశం ఉంటుంది. మార్చి 16వ తేదీన ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని చేపడతారు. ఎన్నికల ప్రక్రియను మార్చి 21వతో ముగిసేలా చర్యలు తీసుకుంటారు.

13 వరకు ఓటు నమోదుకు అవకాశం

ప్రస్తుతం పశ్చిమ రాయలసీమ గ్రాడ్యుయేట్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీలుగా వెన్నపూస గోపాల్‌రెడ్డి, కత్తి నరసింహారెడ్డి ఉన్నారు. వీరి పదవీ కాలం 2023 మార్చి 29వ తేదీతో ముగుస్తుంది. ఈ క్రమంలో కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికల నిర్వహణకు అక్టోబర్ నుంచే కసరత్తు మొదలు పెట్టించింది. ఇందుకోసం పట్టభద్రులు, ఉపాధ్యాయుల నుంచి ఆసక్తి ఉన్న వారితో ఓటర్లుగా నమోదు చేయించింది. మొదట అక్టోబర్ 1 నుంచి నవంబర్ 7వ తేదీ వరకు ఒకసారి, నవంబర్ 23 నుంచి డిసెంబర్ 9వ తేదీ వరకు మరో పర్యాయం అర్హులైన పట్టభద్రులు, ఉపాధ్యాయుల నుంచి ఓటు నమోదు కోసం దరఖాస్తులను ఆహ్వానించింది. రెండు విడతల్లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి డిసెంబర్ 23వ తేదీన ముసాయిదా, డిసెంబర్ 30వ తేదీన తుది ఓటరు జాబితాలను ఎన్నికల సంఘం ప్రకటించింది. ఆ జాబితా ప్రకారం ఉమ్మడి మూడు జిల్లాల పరిధిలో పట్టభద్ర ఓటర్లు 3,28,807 మంది, ఉపాధ్యాయ ఓటర్లు 27,716 మంది ఉన్నారు. అయితే ఎన్నికలకు నెల రోజుల ముందు వరకు ఓటు నమోదుకు ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించింది. దీంతో ఎన్నికలు మార్చి 13వతేదీ జరుగనుండడంతో నెల రోజుల ముందు అంటే ఫిబ్రవరి 13వ తేదీవరకు ఇంకా అర్హులెవరైనా ఉంటే ఓటు కోసం నమోదు చేసుకుంటే పరిశీలించి అవకాశం కల్పిస్తారు. ఫిబ్రవరి 9 నుంచి 13వ తేదీ వ రకు అంటే దాదాపు నాలుగు రోజులు సమయం ఉ ంది. అర్హులెవరైనా ఉంటే ఓటు హక్కు కోసం పట్టభద్రులు, ఉపాధ్యాయులు నమోదు చేసుకోవచ్చు.

అమల్లోకి వచ్చిన ఎన్నికల కోడ్

పశ్చిమ రాయలసీమ పట్టభద్ర, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడంతో జిల్లాలో మోడల్ కండక్ట్ ఆఫ్ కోడ్ అమల్లోకి వచ్చింది. ఫిబ్రవరి 9 నుంచి మార్చి 21వ తేదీ వరకు అమల్లో ఉంటుంది. మంత్రుల పర్యటనలు, ప్రభుత్వ కార్యక్రమాల అమలుపై ఆంక్షలు ఉంటాయి. కోడ్‌ను ఉల్లంఘిస్తే ఎన్నికల కమిషన్ నిబంధనలు మేరకు కేసులు నమోదు చేస్తారు.

మరో 8 పోలింగ్ కేంద్రాలు

కర్నూలు జిల్లాలో ఎమ్మెల్సీ గ్రాడ్యుయేట్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి 66 పోలింగ్ కేంద్రాలను గుర్తించామని, అదనంగా మరో 8 కేంద్రాలను కూడా అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ పి.కోటేశ్వరరావు తెలిపారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా గురువారం విజయవాడ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, జేసీలు, డీఆర్వోలు, జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కోటేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలో గ్రాడ్యుయేట్‌కు సంబంధించి 353, ఉపాధ్యాయులకు సంబంధించి 37 క్లెయిమ్స్, అబ్జెక్షన్స్ ఉన్నాయని, వీటిని త్వరగా పరిష్కరిస్తామని చెప్పారు. గ్రాడ్యుయేట్‌కు సంబంధించి 7, టీచర్స్‌కు సంబంధించి 3 పోలింగ్ కేంద్రాల మార్పునకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లాకు సంబంధించి 2 వేల బ్యాలెట్ బాక్సులు ఉన్నాయని, ఇంకా 160 బాక్సులు అవసరం అవుతాయన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జేసీ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి, డీఆర్వో ఎస్వీనాగేశ్వరరావు, పత్తికొండ, కర్నూలు ఆర్డీఓలు మోహన్‌దాస్, హరిప్రసాద్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ మురళి పాల్గొన్నారు.




వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ కోటేశ్వరరావు

'పది' విద్యార్థులందరూ ఉత్తీర్ణత సాధించాలి

కర్నూలు(సెంట్రల్): పదో తరగతి విద్యార్థులందరూ ఉత్తీర్ణత సాధించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్‌రెడ్డి ఆదేశించారు. గురువారం విజయవాడ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, జేసీలు, ఇతర ఉన్నతాధికారులతో వివిధ అంశాలపై ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. మార్చి నుంచి 2 నుంచి జగనన్న గోరుముద్దలో బెల్లం, రాగితో తయారు చేసిన జావను ప్రతి మంగళ, గురు, శనివారాల్లో ఇవ్వాలన్నారు. ఎనిమిదో తరగతి విద్యార్థులకు ఇచ్చిన ట్యాబ్‌లను సరైన విధానంలో వినియోగించేలా తర్ఫీదు ఇవ్వాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పి.కోటేశ్వరరావు, జేసీ ఎస్.రామసుందర్‌రెడ్డి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఆర్‌అండ్‌బీ ఈఈ శ్రీధర్‌రెడ్డి బదిలీ



ఏవీ శ్రీధర్‌రెడ్డి

కర్నూలు(అర్బన్): రోడ్లు భవనాల శాఖ కర్నూలు ఈఈ ఏవీ శ్రీధర్‌రెడ్డి నంద్యాల జిల్లాకు బదిలీ అయ్యారు. ఈయన స్థానంలో నంద్యాల ఈఈ సురేష్‌కుమార్ ఇక్కడకు రానున్నారు. ఈ మేరకు ఆ శాఖ ప్రభుత్వ కార్యదర్శి ప్రద్యుమ్న ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు శ్రీధర్‌రెడ్డి గురువారం సాయంత్రం జిల్లా కలెక్టర్ పీ కోటేశ్వరరావు, ఎస్‌ఈ కే నాగరాజును మర్యాద పూర్వకంగా కలిసి రిలీవ్ అయ్యారు. ఇక్కడకు బదిలీపై వస్తున్న సురేష్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు చేపట్టనున్నట్లు సమాచారం.

ఆర్టీసీ బస్సుల్లోనే శ్రీశైల మల్లన్న దర్శన టికెట్ల జారీ

కర్నూలు (రాజ్‌విహార్): శ్రీశైలం మల్లన్న దర్శన టికెట్లు బస్సుల్లోనే పొందే వీలు కల్పించినట్లు కర్నూలు జిల్లా ప్రజా రవాణా శాఖాధికారి టి.వెంకటరామం గురువారం తెలిపారు. ఈ నెల 10వ తేదీ నుంచి ప్రత్యేక ప్యాకేజీ కింద శ్రీశైలం వెళ్లే బస్సుల్లో స్పర్శ, శీఘ్ర, అతి శీఘ్ర టికెట్లను ప్రయాణ టికెట్లతో పాటు పొందవచ్చన్నారు. ప్రతి రోజు 1,075 టికెట్లు అందించేలా దేవదాయ శాఖతో ఒప్పందం చేసుకున్నామని, దర్శన సమయం ఉదయం 6 గంటలు, 10 గంటలు, సాయంత్రం 7 గంటలకు ఉంటుందని వివరించారు. అతి శీఘ్ర దర్శనం టికెట్ ధర రూ.300, శీఘ్ర దర్శనం రూ.150 కాగా..ఆయా సమయాల్లో అతి శీఘ్ర దర్శనంకు 100 చొప్పున, శీఘ్ర దర్శనం 150 టికెట్లు చొప్పున జారీ చేస్తామన్నారు. స్పర్శ దర్శనం కోసం ఉదయం 7 గంటలకు 25 టికెట్లు, రాత్రి 9 గంటలకు 200 టికెట్లు, రాత్రి 12.30 గంటలకు 200 టికెట్లు జారీ చేస్తామని, టికెట్ ధర రూ.500లుగా నిర్ణయించినట్లు తెలిపారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయ ఈవో ఆదేశాల మేరకు ఈ నెల 11 నుంచి 21 వరకు స్పర్శ దర్శనం ఉండదని, శీఘ్ర దర్శనం రూ.200గా, అతి శీఘ్ర దర్శనం రూ.500గా ఉంటుందన్నారు.

క్లుప్తంగా

బంగారు గొలుసు చోరీ

జూపాడుబంగ్లా: మండల కేంద్రంలో పట్టపగలు దొంగలు వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసును లాక్కొని ఉడాయించారు. ఇద్దరు యువకులు బైక్‌పై సంతగేటు సమీపంలోని మజీద్‌పెయింట్ దుకాణం వద్దకు వచ్చారు. 250ఎంఎల్ నల్లని పెయింట్ డబ్బా కావాలని దుకాణంలో ఉన్న వృద్ధురాలు ఖాజాబీని కోరారు. ఆమె పెయింట్ డబ్బా అందివ్వగా రూ.100ల నోట్ ఇచ్చారు. చిల్లర ఇచ్చేందుకు యత్నిస్తుండగా వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసును లాక్కొని బైక్‌పై ఉడాయించారు. బాధితురాలు కేకలు వేసేలోగా యువకులు పాములపాడు వైపు దూసుకెళ్లారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సి.వెంకటసుబ్బయ్య తెలిపారు.

పీడీఎస్ బియ్యం సీజ్



నిందితులను చూపుతున్న ఎస్ఐ నల్లప్ప

కల్లూరు: అక్రమంగా తరలుతున్న పీడీఎస్ బియ్యాన్ని పోలీసులు సీజ్ చేశారు. ఉలింద కొండ ఎస్ఐ నల్లప్ప తెలిపిన వివరాలు.. బియ్యం తరలుతోందని వచ్చిన సమాచారంతో గురువారం తెల్లవారుజామున పోలీసులు, రెవెన్యూ అధికారులు సోదాలు చేపట్టారు. అశ్వర్థాపురం శివారులోని సౌదామిని వెంకటేశ్వర పారా బాయిల్డ్, రా రైస్ మిల్లు నుంచి లారీలో తరలిచేందుకు సిద్ధంగా ఉన్న 300 క్వింటాళ్ల (600 ప్యాకెట్లు ఒక్కో ప్యాకెట్ 50 కేజీలు)ప్రజా పంపిణీ బియ్యం, 15 తెలంగాణ మద్యం బాటిళ్లను గుర్తించి సీజ్ చేశారు. డ్రైవర్ బింగి బాబయ్య, క్లీనర్ తపాల మహేష్‌బాబు, మిల్లు గుమాస్తా ఎం.దస్తగిరిలపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. ఇదే కేసుకు సంబంధించి మిల్లు యాజమాని చిన్నబోయిన నాగేశ్వరరావ్‌తోపాటు మరికొంత మందిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు. సోదాల్లో ఆర్ఐ లక్ష్మీనారాయణ, వీఆర్వో శంకర్, ఏఎస్ఐ శంకర్‌నాయక్, హెడ్ కానిస్టేబుల్ కిష్టప్ప, పోలీసులు సురేష్‌కుమార్, విష్ణు పాల్గొన్నారు.

పేదింటి ఆడబిడ్డలకు ప్రభుత్వ దీవెన

- నేడు వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీతోఫా విడుదల
- బటన్ నొక్కి నిధులు జమ చేయనున్న సీఎం వైఎస్ జగన్
- బడుగు, బలహీన వర్గాల వారికి ఉపశమనం
- ఉమ్మడి జిల్లాలో 544 మందికి రూ.4.65 కోట్ల ప్రోత్సాహకం



కర్నూలు(అగ్రికల్చర్): పేదల ఇళ్లలో ఆడబిడ్డల పెళ్లి ఖర్చులకు రాష్ట్రప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తోంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, దివ్యాంగ వర్గాల చెందిన కుటుంబాలకు వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీతోఫా పథకాన్ని అమలు చేస్తోంది. ఈ పథకం కింద లబ్ధిదారులకు ఆర్థిక సాయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం బటన్ నొక్కి జమచేయనున్నారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లో ప్రత్యక్ష ప్రసారం ద్వారా అధికారులు, లబ్ధిదారులు వీక్షించనున్నారు. లబ్ధిదారులతో వర్చువల్‌గా ముఖ్యమంత్రి మాట్లాడే అవకాశం ఉంది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావుతో పాటు ఎంపీ, ఎమ్మెల్యేలు హాజరుకానున్నారు.

ఉమ్మడి జిల్లాలో 544 మందికి లబ్ధి..

వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీతోఫా పథకం కింద ఉమ్మడి కర్నూలు జిల్లాలో 544 మందికి రూ.4.65 కోట్ల ప్రోత్సాహకం అందనుంది. ఎస్సీ, ఎస్టీ అమ్మాయిలకు రూ.లక్ష, ఎస్సీ, ఎస్టీ అమ్మాయిలు ఇతర కులాల వారిని వివాహం చేసుకుంటే రూ.1.20 లక్షలు, బీసీ అమ్మాయిలకు రూ.50,000, బీసీ అమ్మాయిలు ఇతర కులాల వారిని వివాహం చేసుకుంటే రూ.75వేలు, ముస్లిం మైనార్టీ అమ్మాయిలకు రూ.లక్ష, దివ్యాంగుల అమ్మాయిలకు రూ.1.50 లక్షల ప్రకారం ప్రభుత్వం ఆర్థిక సాయం అందజేస్తోంది. కర్నూలు జిల్లాలో 354 మంది దరఖాస్తు చేసుకోగా 271 మందికి అర్హత లభించింది. వీరి బ్యాంకు ఖాతాలకు డీబీటీ ద్వారా రూ.2,31,40,000 నగదు జమ కానుంది. నంద్యాల జిల్లాలో 337 మంది దరఖాస్తు చేసుకోగా 273 మంది అర్హత సాధించారు. వీరి బ్యాంకు ఖాతాలకు రూ.3,34,20,000 జమకానుంది.

అర్హతలు ఇవే..

2022 అక్టోబరు 1 నుంచి వివాహాలు చేసుకున్న యువతులకు వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీతోఫా పథకం వర్తిస్తుంది. అర్బన్‌లో ఏడాదికి రూ.1.20 లక్షలు, గ్రామీణ ప్రాంతాల్లో రూ.లక్షలోపు ఆదాయం కలిగి ఉన్న వారే అర్హులవుతారు. ఆదాయపు పన్ను చెల్లిస్తున్న వారు, 1000 చదరపు అడుగులపైన ఇల్లు కలిగిన వారు, ఫోర్ వీలర్ కలిగిన వారు, 300 యూనిట్ల కంటే ఎక్కువ విద్యుత్ వినియోగిస్తున్న వారు అనర్హులవుతారు. రాజకీయాలకు అతీతంగా అర్హత కలిగిన వారందరికీ ఈ పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తోంది.

ఎంతో సంతోషం



మాది నిరుపేద కుటుంబం. మేం కర్నూలు బుధవార పేటలో ఉంటున్నాం. ప్రదీప్ అనే యువకుడితో 2022 డిసెంబరు 14న నాకు వివాహమయ్యింది. మా కుటుంబ పెద్దలు అప్పులు తెచ్చి పెళ్లి చేశారు. ప్రభుత్వం కల్యాణమస్తు ద్వారా రూ.లక్ష ఆర్థిక సహాయాన్ని అందచేస్తోంది. శుక్రవారం నా బ్యాంకు ఖాతాకు రూ.లక్ష నగదు జమ చేయనున్నారు. ఇది మాకు ఎంతో సంతోషాన్ని ఇస్తోంది. – జే.సుగుణ

ఆనందంగా ఉంది



మేం కర్నూలులోని కుమ్మరిగేరిలో నివసిస్తున్నాం. 2022 నవంబరు 25న సయ్యద్ నిజాముద్దీన్‌తో నాకు వివాహమయ్యింది. నా బ్యాంకు ఖాతాకు షాదీతోఫా కింద రూ.లక్ష ఆర్థిక సహాయం విడుదల కానుందని తెలిసింది. చాలా ఆనందంగా ఉంది. – సయ్యదా రూబియా మెహరాని

పారదర్శకంగా అర్హుల ఎంపిక



కల్యాణమస్తు, షాదీతోఫా కింద లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేశాం. సిక్స్‌స్టెప్స్ వ్యాలుడేషన్‌ను పరిగణనలోకి తీసుకున్నాం. కర్నూలు జిల్లాలో 271 మంది అమ్మాయిలకు అర్హత లభించింది షాదీతోఫా పొందే ముస్లిం అమ్మాయితో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్‌గా మాట్లాడే అవకాశం ఉంది. – వెంకటసుబ్బయ్య, పీడీ, డీఆర్‌డీఏ–వైకేపీ, కర్నూలు

జాతీయ స్థాయి పోటీల్లో ఆత్మకూరు విద్యార్థి ప్రతిభ



ట్రోఫీని అందుకుంటున్న రవి

కర్నూలు (టౌన్): జాతీయ స్థాయి సాఫ్ట్ బాల్ పోటీల్లో ఆత్మకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల మొదటి సంవత్సరం విద్యార్థి నల్లగొటి రవి ప్రతిభ కనబరిచాడు. ఒడిశా రాష్ట్రం పూరి నగరంలో ఈనెల 5 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించిన 44వ జాతీయ స్థాయి సీనియర్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు బంగారు పతకం సాధించింది. జట్టు విజయంలో ఆత్మకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి నల్లగొటి రవి కీలకంగా వ్యవహరించాడు. ఫైనల్ మ్యాచ్‌లో 1–0 స్కోర్‌తో ఏపీ జట్టును గెలిపించాడు. జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన రవిని సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి విజయ్, పలువురు క్రీడా సంఘాల ప్రతినిధులు అభినందించారు.

దూసుకొచ్చిన మృత్యువు

- గుర్తుతెలియని వాహనం ఢీకొని 30 జీవాలు మృతి



ప్రమాదంలో మృతి చెందిన జీవాలు

ఓర్వకల్లు: అతివేగం, డ్రైవర్ నిర్లక్ష్యంతో మూగజీవాలపైకి మృత్యువు ఐచర్ వాహనం రూపంలో దూసుకొచ్చింది. క్షణాల్లో 30 జీవాల ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి. ఈ ఘటన గురువారం ఉదయం మండల పరిధిలోని హైవేపై చోటుచేసుకుంది. పూర్తి వివరాలు.. నన్నూరు గ్రామానికి చెందిన కురువ మద్దయ్య, ఎల్లస్వామిలకు 200 గొర్రెలు ఉన్నాయి. వాటిని ఈత వేసేందుకని ఓర్వకల్లు సమీపంలోని లింగం వారి చెరువుకు తీసుకెళ్లేందుకు తెల్లవారు జామున బయలుదేరారు. మరో ఐదు నిమిషాల్లో చెరువు వద్దకు చేరుకోవాల్సి ఉండగా జాతీయ రహదారిపై సుబ్బారెడ్డి దాబా సమీపంలో రోడ్డు దాటుతున్న జీవాలపై కర్నూలు నుంచి నంద్యాల వైపు వెళ్తున్న గుర్తుతెలియని ఐచర్ వాహనం దూసుకెళ్లింది. ప్రమాదంలో 30 జీవాలు అక్కడికక్కడే మృతి చెందగా, మరో 10 జీవాలు తీవ్రంగా గాయపడ్డాయి. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద తీరును పరిశీలించారు. దాదాపు రూ.3 లక్షల వరకు నష్టం వాటిల్లిందని యజమానులు వాపోయారు. స్థానిక పశు వైద్యుడు మనోజ్‌కుమార్ పంచనామా నిర్వహించారు. వాహనం ఆచూకీ కోసం నన్నూరు టోల్ ప్లాజా వద్ద ఉన్న సీసీ పుటేజీలను పరిశీలించినా ఆచూకీ లభ్యం కాలేదని, బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టామని ఎస్ఐ మల్లికార్జున తెలిపారు. కా గా మృతి చెందిన జీవాల యజమానులను ఆదుకోవాలని కురువ సంఘం మండల అధ్యక్షులు అల్లబాబు, ప్రజా సంఘాల నాయకులు నాగన్న, శ్రీధర్ కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

- మరొకరి పరిస్థితి విషమం



మృతిచెందిన రాము



గాయపడిన బోయ ఉలిగేష్

ఆదోని రూరల్: ఆదోని–సిరుగుప్ప రహదారిలోని మదిరె క్రాస్ రోడ్డు సమీపంలోని ఎన్డీబీఎల్ ఫ్యాక్టరీ వద్ద గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. గాజులదిన్నె గ్రామానికి చెందిన రామకృష్ణ అనే వ్యక్తి కారులో ఆదోని నుంచి సిరుగుప్పలోని బంధువులకు పెళ్లి కార్డులను ఇచ్చేందుకు బయలుదేరాడు. మదిరె క్రాస్ రోడ్డు వద్ద ఎన్‌డీబీఎల్ ఫ్యాక్టరీ సమీపంలో సిరుగుప్ప నుంచి ఎదురుగా వస్తున్న మోటార్‌బైకు వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మోటార్‌సైకిల్‌పై ప్రయాణిస్తున్న హొళగుందకు చెందిన బోయ ఉలిగేష్(26) తీవ్రంగా గాయపడగా, అతని స్నేహితుడు సిరుగుప్ప తాలూకా బెళగల్‌కు చెందిన రాము(28) ఎగిరి కారుపై పడి మృతిచెందాడు. తీవ్రంగా గాయపడిన ఉలిగేష్‌ను 108 వాహనంలో ఆదోని ఆస్పత్రికి తరలించారు. ఇస్వీ పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

ఎదురీదలేక.. ఎదిరించలేక.. బలవన్మరణాలు

సాక్షి నెట్‌వర్క్: సమస్య చిన్నదో, పెద్దదో దానితో పోరాడి విజయం సాధించాలి. ఇతరులకు స్ఫూర్తిగా నిలవాలి. అయితే కొందరు సమస్యను ఎదిరించలేక, దానికి ఎదురీద లేక బలవంతంగా తనువులు చాలిస్తున్నారు. ఆత్మహత్యలకు పాల్పడుతూ ఆప్తులకు దుఃఖాన్ని మిగిలిస్తున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో గురువారం వేర్వేరు చోట్ల నలుగురు ఆత్మహత్య చేసుకున్నారు. అనారోగ్యంతో ఒకరు, అప్పుల బాధతో ఇద్దరు, భార్య, బిడ్డలు తన వద్దకు రావడంతో లేదని ఒకరు బలవన్మరణానికి పాల్పడ్డారు.

అప్పులు ఎక్కువ అయ్యాయని..

ఆలూరు: అప్పులు ఎక్కువ అయ్యాయని హత్తిబెళగల్ గ్రామానికి చెందిన రైతు గంటి ఈరన్న(42) పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ నాయక్, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. గంటి ఈరన్నకు ఆరు ఎకరాల పొలం ఉంది. దీనికి తోడు మరో ఐదు ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని వివిధ రకాల పంటలు సాగు చేస్తూ వచ్చాడు. పెట్టుబడి కోసం రూ.13 లక్షలకు పైగా అప్పు చేశాడు. అప్పులు ఎక్కువయ్యాయని మనస్తాపం చెంది మూడు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఆలూరు, చిప్పగిరి గ్రామాలకు వెళ్లే రహదారి సమీపంలో కల్లివంక వాగు వద్ద గురువారం విగతజీవిగా కనిపించాడు. స్థానిక రైతులు గర్తించి అతని భార్య యల్లమ్మ, కుమారుడు రాజుకు సమాచారాన్ని చేరవేశారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ నాయక్ విలేకరులకు తెలిపారు.

భార్య, పిల్లలు రాలేదని..

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని గూడూరు బైపాస్ రోడ్డు మహబూబ్‌నగర్ కాలనీలో వడ్డే మధు(36) అనే వ్యక్తి గురువారం సాయంత్రం ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు తెలిపిన వివరాలు.. కర్ణాటక రాష్ట్రం బెల్గాంకు చెందిన వడ్డే మధు(36) కొన్ని సంవత్సరాల క్రితం ఎమ్మిగనూరుకు వలస వచ్చి ఇక్కడే స్థిరపడ్డాడు. బెల్గాంకు కెందిన తమ బంధువుల అమ్మాయిని పెళ్లి చేసుకున్నాడు. వీరికి ముగ్గురు సంతానం. అయితే కొన్ని నెలల క్రితం భార్య, పిల్లలు బెల్గాంకు వెళ్లి తిరిగిరాలేదు. ఇంట్లో ఒంటరిగా ఉండలేక మనస్తాపం చెంది గురువారం సాయంత్రం గుడిసె తలుపు పైభాగానికి చీరకట్టుకొని ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. భార్య, పిల్లలు, కుటుంబ సభ్యులు వస్తే ఆత్మహత్యకు కారణాలు తెలుస్తాయని చెప్పారు.

అనారోగ్యంతో..

కోవెలకుంట్ల: సంజామల మండల కేంద్రానికి చెందిన ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంది. గురువారం ఎస్ఐ ప్రతాప్ తెలిపిన వివరాలు.. సంజామలకు చెందిన నాగవేణి(36)కి, బనగానపల్లె మండలం యనకండ్ల గ్రామానికి చెందిన సుబ్బయ్యకు 12 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి సంతానం కలుగలేదు. ఏడేళ్ల క్రితం భర్త అనారోగ్యంతో మృతి చెందటంతో పుట్టినింటికి చేరుకుని తల్లి రత్నమ్మ వద్ద ఉంటూ జీవనం సాగిస్తోంది. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ జీవితంపై విరక్తి చెంది బుధవారం పురుగు మందు తాగి అపస్మారక స్థితికి చేరుకుంది. గమనించిన బంధువులు చికిత్స నిమిత్తం కోవెలకుంట్ల ఆసుపత్రికి తరలించగా కోలుకోలేక మృతి చెందింది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యాపారం కలసి రాక..

కొలిమిగుండ్ల: అంకిరెడ్డిపల్లెకు చెందిన చాకలి కమలాకర్(35) అప్పుల బాధతో గురువారం తెల్లవారు జామున ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ రమేష్‌రెడ్డి తెలిపిన వివరాలు.. కమలాకర్ గొర్రెల వ్యాపారంతో పాటు ప్రతి ఆది, మంగళవారాల్లో గొర్రెలు కోసి మాంసం విక్రయిస్తుండేవాడు. వ్యాపారం కలిసి రాకపోవడంతో అప్పులపాలయ్యాడు. వీటిని తీర్చే మార్గం లేక రాత్రి కుటుంబ సభ్యులు నిద్రపోయాక వరండా సమీపంలో లుంగీతో ఉరివేసుకున్నాడు. తెల్లవారు జామున కుటుంబ సభ్యులు గమనించేలోపు విగతజీవిగా మారాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య మీనా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

జల్సా దొంగలు

- ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల్లో దొంగతనాలు, దోపిడీలు, బెదిరింపులు
- ముగ్గురు యువకులు, ఒక వ్యక్తి అరెస్ట్
- రూ.24 లక్షల విలువచేసే సొత్తు స్వాధీనం
- 60 సెల్‌ఫోన్‌లు, 14 మోటార్ సైకిళ్లు స్వాధీనం



నిందితులు, స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్‌లు, మోటార్‌సైకిళ్లను చూపుతున్న పోలీసులు

ఆదోని అర్బన్: జల్సాలకు అలవాటుపడి అంతర్ రాష్ట్ర దొంగలుగా మారిన నలుగురు యువకులను త్రీటౌన్ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. వీరి నుంచి 60 సెల్‌ఫోన్‌లు, 14 బైకులను, తొమ్మిది మారణాయుధాలను, రూ.1,600 నగదు స్వాధీనం చేసుకున్నారు. డీఎస్పీ వినోద్‌కుమార్ వివరాలను మీడియాకు వివరించారు. డివిజన్ పరిధిలోని కోసిగి మండలం సాతనూరు గ్రామానికి చెందిన షికారి ప్రేమేష్ అలియాస్ షిండే బక్కోడు, కౌతాళం గ్రామానికి చెందిన వర్ష అలియాస్ గుడ్డోడు, కర్ణాటక రాష్ట్రం హుబ్లీకి చెందిన వర్షానాయక్, కర్ణాటక రాష్ట్రం బళ్లారి జిల్లా సంగనకల్ గ్రామానికి చెందిన శ్రీనాయక్‌లు ప్రస్తుతం బళ్లారి జిల్లా సంగనకల్ గ్రామంలో ఉంటున్నారు. ఈ నలుగురు జల్సాలకు అలవాటుపడి ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల్లో దొంగతనాలు, దోపిడీలకు పాల్పడుతున్నారు. బెదిరించడం, ఎదురుతిరిగిన వారిపై కత్తులు, రాళ్లతో దాడి చేయడం చేస్తున్నారు. ఈ నలుగురిని స్థానిక ఎమ్మిగనూరు రోడ్డులోని బైపాస్ వద్ద త్రీటౌన్ పోలీసులు అరెస్టు చేశారని చెప్పారు. వీరి వద్ద 60 సెల్‌ఫోన్‌లు, 14 మోటార్‌సైకిళ్లు, 9 మారణాయుధాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. 60 సెల్‌ఫోన్‌ల విలువ రూ.12 లక్షలు, 14 మోటార్‌సైకిళ్ల విలువ రూ.12.14 లక్షలు ఉంటుందన్నారు. ఈ కేసులో ప్రతిభ కనబరిచిన త్రీటౌన్ సీఐ శ్రీరామ్, హెడ్‌కానిస్టేబుల్ ప్రాణేశ్వర్‌స్వామి, పోలీసు కానిస్టేబుళ్లు క్రిష్ణయ్యనాయుడు, నరేంద్ర, వెంకటేశ్వర్లు, వెంకటలక్ష్మి, నభిలను డీఎస్పీ అభినందించారు.

దారి దోపిడీలు, చోరీలు కొన్ని..

- గత నెల 24న ఎమ్మిగనూరు రోడ్డులో ఆగి ఉన్న లారీలో నిద్రపోతున్న నంద్యాలకు చెందిన డ్రైవర్ పురుషోత్తం వద్ద ఒక సెల్‌ఫోన్, రూ.5 వేలు దొంగలించుకుని ప్రేమేష్ వెళ్తుండగా సదరు లారీ డ్రైవర్ వెంటపడి పట్టుకున్నాడని డీఎస్పీ తెలిపారు. అయితే రెండో ముద్దాయి వర్ష తన వద్ద ఉన్న కత్తితో విచక్షణారహితంగా పొడిచి ఆ నలుగురు పారిపోయారన్నారు.
- 2022 అక్టోబర్ నెలలో ప్రేమేష్, వర్షానాయక్ కలిసి కర్నూలు బస్టాండ్ దగ్గర రైల్వే బ్రిడ్జి వద్ద ఒక వ్యక్తి మోటార్‌సైకిల్‌ను దొంగలించే ప్రయత్నంలో యజమానిని బలవంతంగా కాలువలోకి తోసి మరణానికి కారణమయ్యారని చెప్పారు.
- గత బుధవారం రాత్రి స్థానిక ఎమ్మిగనూరు బైపాస్‌లోని బృందావన్ బార్ అండ్ రెస్టారెంట్ వద్ద 12 మోటార్‌సైకిళ్లను దొంగలించుకుని, అక్కడే కల్వరికొండ వద్ద దాచి పెట్టారన్నారు.
- వేర్వేరు ప్రాంతాల్లో దోచుకున్న సెల్‌ఫోన్‌లను అమ్ముకుని, కొన్ని సెల్‌ఫోన్‌లను కల్వరికొండ వద్ద దాచి పెట్టారని తెలిపారు.
- ఎనిమిదేళ్ల క్రితం కర్ణాటక రాష్ట్రంలోని రాయచూరు హైవే జౌలగిరి గ్రామం రోడ్డు మీద ఆగి ఉన్న కారులోని వ్యక్తిని కత్తులతో బెదిరించి అతని వద్ద రూ.6 లక్షల నగదును ప్రేమేష్, మరొకరు కలిసి దొంగలించారన్నారు.
- రాత్రి వేళల్లో రోడ్డుపక్కన ఆగి ఉన్న లారీలలో నిద్రపోతున్న డ్రైవర్‌లను బెదిరించి సెల్‌ఫోన్‌లు, నగదును దోచుకున్నారని, తిరగబడితే మారుణాయుధాలతో దాడి చేసినట్లు డీఎస్పీ తెలిపారు.

ప్రైవేట్ ఆసుపత్రుల్లో నిబంధనల ఉల్లంఘన

- 16 కేసులు నమోదు చేసిన తూనికలు, కొలతల శాఖ అధికారులు



చికిత్సకు వాడే మెడికల్ సామగ్రి నాణ్యతను పరిశీలిస్తున్న తూనికలు, కొలతల శాఖ అధికారులు

కర్నూలు: నగరంలో కొందరు ప్రైవేట్ ఆసుపత్రుల నిర్వాహకులు నిబంధలను ఉల్లంఘిస్తున్నట్లు తూనికలు, కొలతల శాఖ అధికారుల తనిఖీలో వెల్లడైంది. దీంతో 16 కేసులు నమోదు చేశారు. తూనికలు, కొలతల శాఖ ఏపీ డీజీపీ కిషోర్‌కుమార్ ఆదేశాల మేరకు కర్నూలు, అనంతపురం జిల్లాలకు చెందిన అధికారులు నాలుగు బృందాలుగా ఏర్పడి గురువారం కర్నూలు నగరంలో తనిఖీలు నిర్వహించారు. కిమ్స్, హార్ట్ అండ్ బ్రెయిన్, విజయదుర్గ, ఒమెగా, అమేలియో, విశ్వభారతి, గౌరీగోపాల్ ఆసుపత్రుల్లో తనిఖీలు నిర్వహించారు. కిమ్స్ హాస్పిటల్‌లో వినియోగిస్తున్న మెడికల్ పరికరాలు, ఫేస్ మాస్కులకు తయారీదారుల చిరునామా లేకపోవడం వంటి లోపాలను గుర్తించారు. నాన్ డిక్లరేషన్ కింద రెండు కేసులు నమోదు చేశారు. అలాగే హార్ట్ అండ్ బ్రెయిన్ హాస్పిటల్‌లోని మురారీ ఫార్మసిలో ఫేస్ మాస్కులపై తయారీదారుల చిరునామా లేకపోవడం, ఎంఆర్‌పీ లేకపోవడం వంటి లోపాలను గుర్తించి ఒక కేసు నమోదు చేశారు. సర్జికల్ గ్లౌజ్‌లు, మెడికల్ పరికరాలపై కూడా తయారీదారుల చిరునామాలు లేకపోవడం వంటి లోపాలను గుర్తించారు. అలాగే విజయదుర్గ కార్డియాక్ సెంటర్‌లో యూరో సెట్స్ ప్యాకేజీపై లీగల్ మెటరాలజీ శాఖ నామ్స్ ప్రకారం డిక్లరేషన్స్ లేకపోవడంతో ఒక కేసు నమోదు చేశారు. ఒమేగా హాస్పిటల్‌లో వినియోగిస్తున్న అడల్ట్ డైపర్స్‌పై నిర్దేశాల ప్రకారం డిక్లరేషన్లు లేకపోవడంతో నాలుగు కేసులు నమోదు చేశారు. అమేలియో ఆసుపత్రిలో వినియోగిస్తున్న కాంటాక్ట్ లెన్స్ ప్యాకేజెస్, గ్లౌజ్ ప్యాకేజెస్, క్యాథిరేటర్స్‌పై డిక్లరేషన్స్ లేకపోవడం వంటివి గుర్తించారు. అలాగే నాన్ స్టాండర్డ్ వేయింగ్ మెషీన్లు రెండు వినియోగిస్తున్నట్లు గుర్తించి మొత్తం ఆరు కేసులు నమోదు చేశారు. తనిఖీల్లో కర్నూలు డీసీ సుబ్బారెడ్డి, ఏసీలు స్వామి, జిలానీ, శ్రీరాములు, ఇన్‌స్పెక్టర్లు గౌస్, కుమార్, శంకర్, శివశంకర్, ఖాజా హుసేన్, అనిత, వరప్రసాద్ పాల్గొన్నారు. ఆయా ఆసుపత్రులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోనున్నట్లు జాయింట్ కంట్రోలర్ గోపికృష్ణారెడ్డి తెలిపారు.